క్లుప్తంగా

నడకతో ఆరోగ్యకర సమాజం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాస పట్నాయక్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నడకతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మహాత్మా గాంధీ ఫెలోషిప్ అవార్డు మహోత్సవం జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ ఫెలోషిప్ ఉత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ ఫెలోషిప్ అవార్డును సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస పట్నాయక్‌కు అందించారు. వాకర్స్ గవర్నర్ కొంక్యాణ మురళీధర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిత్య వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు, డాక్టర్ పైడి సింధూర, డాక్టర్ వినీలభాయ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే



మాట్లాడుతున్న ఆర్డీవో కె.సాయిప్రత్యూష

గార: భూముల రీసర్వే పారదర్శకంగా చేపడతామని, రైతులు తప్పకుండా సర్వే సమయంలో ఉండేలా రెవెన్యూ అధికారులు సమాచారమివ్వాలని ఆర్డీవో కె.సాయిప్రత్యూష సూచించారు. మండలంలోని కె.సైరిగాంలో మంగళవారం రీసర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ వివరాలతో సిబ్బందికి అందుబాటులో ఉండాలన్నారు. సర్వేలో తప్పులకు ఆస్కారం లేకుండా చూస్తామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తోనంగి, వమరవల్లి పంచాయతీల్లో ప్రారంభమైన రీసర్వేలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెవిటి పోలమ్మకు పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో వెలిసిన చెవిటి పోలమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు



అంగన్‌వాడీలో చిన్నారితో విజయ ప్రతాప్ రెడ్డి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ఆహార కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీలు, వసతి గృహాలు, రేషన్ డిపోలను మంగళవారం విస్తృతంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఉదయం గుజరాతీపేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించి, అక్కడ సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. అక్కడ నుంచి హయాతీనగర్ రేషన్ డిపోను తనిఖీ చేశారు. తర్వాత నగరంలోని బీసీ సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాన్ని పరిశీలించారు. అక్కడ వసతి గృహం తెరవకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలు లేకపోవడంతో పాటు వార్డెన్ అందుబాటులో లేనందున వెనుదిరిగారు. ఆయనతో పాటు డీఎస్‌వో సూర్యప్రకాశరావు తదితరులు ఉన్నారు.

డీఎల్‌డీవో కార్యాలయం సందర్శన



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: జిల్లా పరిషత్ కార్యాలయంలో కొత్తగా కేటాయించిన శ్రీకాకుళం డివిజన్ డీఎల్‌డీవో కార్యాలయాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం సందర్శించారు. కార్యాలయంలో ఇంకా అవసరమైన స్టేషనరీ ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆమెతో పాటు సీఈవో సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ బంగారునాయుడు, ఏఈ పోలినాయుడు తదితరులు ఉన్నారు.

కూరగాయల రైతు కుదేలు

- దెబ్బతీసిన అధిక వర్షాలు
- కుళ్లిపోయిన పంటలు
- నష్టాలు తప్పవని ఆందోళన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

గార: గత కొన్ని రోజులుగా ఏర్పడుతున్న వరుస వాయుగుండాలతో కూరగాయల రైతులు కుదేలయ్యారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పంటలు పూర్తిగా పాడైపోయి అపార నష్టం వాటిల్లింది. మండలంలో శ్రీకూర్మంలోని పొందర వీధి, తూలుగు పంచాయతీ, అంపోలు, నిజామాబాద్, చల్లపేటలతో పాటు అనేక గ్రామాల్లో ఎక్కువగా కూరగాయల సాగు జరుగుతోంది. వీరు పండించిన కూరగాయలను శ్రీకాకుళం నగరం, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మకాలు సాగిస్తుంటారు. అయితే కుండపోతగా కురిసిన వర్షాలతో వంగ, టమాట, తోటకూర, పాలకూర, చుక్క కూర, మెంతు కూర, కొత్తిమీర, ముల్లంగి వంటి పంటలు నాశనమయ్యాయని వాపోతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టగా.. నష్టాల ఊబిలో చిక్కుకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పెరిగిన ధరలు

జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ నుంచి అధికంగా పూజలు నిర్వహిస్తుంటారు. భవానీ దీక్షలు, కార్తీక మాసం, అయ్యప్ప దీక్షలు ఇలా అన్ని ఆధ్యాత్మిక నెలలు కావడంతో ఎక్కువ మంది శాఖాహారంపై మొగ్గు చూపుతారు. ఆరోగ్య రీత్యా తోటకూర, పాలకూర, ముల్లంగి, గోంగూర, చుక్క కూర, పొనగంటి వంటివి వారంలో 5 రోజుల పాటు తీసుకునే వారు అధికంగా ఉన్నారు. అయితే వర్షాల దెబ్బకు పంటలు నాశనమవ్వడంతో ప్రస్తుతం మార్కెట్లో విరివిగా దొరకడం లేదు. దీంతో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా సామాన్యుడిపై ధరల పెరుగుదల భారం పడుతోంది.



కుళ్లిపోతున్న పంటవైపు దిగాలుగా చూస్తున్న రైతు భద్రయ్య



మొక్కలు చనిపోవడంతో ఖాళీగా ఉన్న మడులు



అంపోలులో కుళ్లిపోయిన ఆకుకూరల పంట

తీవ్రంగా నష్టపోయాను



చిన్నప్పటి నుంచి ఆకు కూరలు, కాయగూరల పంటలు పండిస్తున్నాను. వాతావరణంలో మార్పులు వలన అధికంగా వర్షాలు ఒకేసారి కురవడంతో పంట నాశమయ్యింది. వర్షం వలన మడుల్లో నీరు చేరి ఊటపట్టి పంట అంతా కుళ్లిపోతోంది. అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. చేతికి అందివచ్చిన పంట పాడైపోవడంతో అధిక నష్టం తప్పేలా లేదు.

– గంగు శంకరరావు, పొందర వీధి, శ్రీకూర్మం

ప్రభుత్వం ఆదుకోవాలి



పెట్టుబడి పెట్టిన పంటలన్నీ కళ్లదుటే కుళ్లిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా వర్షాలు వచ్చి చాలా నష్టపోయాం. అప్పులు చేసి నాకున్నటువంటి భూమిలో పాలకూర, తోటకూర, ముల్లంగి, గోంగూర వంటివి వేశాను. ప్రస్తుతం పది పైసల వాటా పంట కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రావాల్సిన ఆదాయాన్ని వర్షం తినేసింది. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– గంగు శ్రీనివాసరావు, పొందరవీధి, శ్రీకూర్మం

వర్షాలతో నష్టపోయాను



ప్రతిఏటా అన్ని రకాల ఆకుకూరలు, పొలం చుట్టూ బెండ వంటి పాదులు వేస్తుంటాను. ఇటీవల భారీ వర్షాలతో మడుల్లో ఉన్న ఆకుకూర, పాలకూర వంటివి కుళ్లిపోయి చనిపోయాయి. ప్రతిరోజూ గ్రామాల్లోకి వెళ్లి కూరలు అమ్ముతుంటాను. ఈసారి వర్షాలు వలన చాలా నష్టపోయాను. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

– కోటిలింగాల భార్గవ, అంపోలు

మోసం చేయడమే చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ఎన్నికలకు ముందు హామీలిచ్చి.. తర్వాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వాండ్రంగి, ఆనందపురం, దవళపేట, పాలఖండ్యాం గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు జోల వెంకటరమణ అధ్వర్యంలో గ్రామస్థాయి కార్యకర్తలతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు అధిష్టానం తప్పనిసరిగా గుర్తింపునిస్తుందని తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువతకు భృతి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా అనునిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ఆర్టీఐ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, జిల్లా యువజన సభ్యుడు బాలి అప్పలసూరి, ఎస్సీ సెల్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి లోపింటి జీవన్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఈసర్ల గోవిందరావు, ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, సర్పంచ్‌లు వడిశ మహేశ్వరరావు, బుడారి లక్ష్మణరావు, ఇజ్జి గోవిందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, రాయపురెడ్డి సూర్యనారాయణ, మండల వ్యవసాయశాఖ సలహా మండలి మాజీ చైర్మన్ మక్క వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు కోర్టు ప్రాంగణంలో బీసీ న్యాయవాదుల సంఘం, అల్ ఇండియా న్యాయవాదులు సంఘం, ఇతర న్యాయవాదులు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ దాడిని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు వాన కృష్ణచంద్, మామిడి క్రాంతి, కె.నాగభూషణరావు, సనపల హరి, కొమర శంకర్, సింతు సూర్యనారాయణ, సీడి శంకర నారాయణ, వి.కృష్ణారావు, పి.నాగేశ్వరరావు, బి.సుదర్శన్, డొంకాన ఈశ్వరరావు, కూన అన్నం నాయుడు, పి.రమేష్, ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖండిస్తున్నాం

సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించడాన్ని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదరరావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహిస్తున్న సమయంలో న్యాయవాద దుస్తుల్లో ఉన్న వ్యక్తి దాడి చేయాలని ప్రయత్నం చేయడం హేయమైన చర్య అన్నారు.

శ్రీకాకుళం: సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని భారత రాజ్యాంగంపై దాడిగానే గుర్తించాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొంటి గిరిధర్, కుప్పిలి కామేశ్వరరావు డిమాండ్ చేశారు. రాజ్యాంగ రక్షకుడిపైనే దాడి జరిగినప్పుడు సామాన్య ప్రజలకు ఏవిధమైన న్యాయం జరుగుతుందో ప్రస్తుత పాలకులే తెలియజేయాలన్నారు. స్వతంత్రంగా ఉంటేనే ప్రజాస్వామ్యం మనుగడ సాధిస్తుందన్నారు.

అభినందనలు



పీజీ గుప్తాను అభినందిస్తున్న స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: వాకర్స్ ఇంటర్నేషనల్ 312 ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా విజయం సాధించిన శ్రీకాకుళం స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యుడు, మాజీ గవర్నర్ పీజీ గుప్తాను శ్రీకాకుళం డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో అనేక వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేయడంలో గుప్తా కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఉదయం నడక, వ్యాయామాల ద్వారా ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు వాకర్స్ సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. మరింత మంది ప్రజలు వ్యాయామం, ఉదయం నడకపై ఆకర్షితులు కావడానికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ పీజీ గుప్తా మాట్లాడుతూ తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డీసీ వావిలపల్లి జగన్నాథ నాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, స్టార్ వాకర్స్ అధ్యక్షుడు గుడ్ల జగ్గారావు, స్టార్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మి, సీనియర్ జర్నలిస్టు నాగేశ్వర ఈశ్వరరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఎస్.సంజీవరావు, డాక్టర్ కె.పాండురంగారావు, బీఎస్ఎన్ఎల్ నాయుడు, ఎం.మల్లిబాబు, వై.మోహన్, జి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాలే దిక్కు

- అరకొర వసతులతోనే ఉద్యోగులు



అద్దె భవనంలో నడుస్తున్న రణస్థలం ఎక్సైజ్ కార్యాలయం

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని కీలకమైన రణస్థలం మండల కేంద్రంలో సగానికి పైగా ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలో ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే కార్యాలయాల పరిస్థితి కూడా ఇదే. గతంలో వీటికి ప్రభుత్వ స్థలం కేటాయించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా.. సకాలంలో సంబంధిత శాఖలు స్పందించకపోవడంతో నిధులు కాస్త వెనక్కి వెళ్లిపోయాయి. ఫలితంగా నేటికీ అరకొర వసతులతోనే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి అధికంగా ఆదాయం తీసుకొచ్చే సబ్ రిజిస్ట్రార్, ఎక్సైజ్ కార్యాలయాలకు దశాబ్దాలుగా సొంత భవనాల్లేవు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అప్పట్లో నిధులు మంజూరయ్యాయి. అయితే స్థలం లేకపోవడంతో నిధులు వెనక్కిమళ్లాయి. అదేవిధంగా ఉప ఖజానా, ఐసీడీఎస్ ప్రాజెక్టు, బీఎస్ఎన్ఎల్, ఉద్యాన, మత్స్యశాఖ కార్యాలయాలకు సొంత కార్యాలయాలు లేవు. బాలికలు, బాలుర కళాశాల వసతి గృహాలు సైతం అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఎచ్చెర్ల పీఏసీఎస్ భవనం, నాలుగు మండలాల్లోని సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల భవనాలు, రైతుసేవా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు దాదాపు పూర్తి కావడంతో కొంతవరకు ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. అందువలన ఇప్పటికైనా పాలకులు చొరవ తీసుకుని ప్రభుత్వ భవనాలు నిర్మించి లక్షల్లో చెల్లిస్తున్న అద్దెలకు విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఎటువంటి అనుమతులు రాలేదు


రణస్థలం ఎక్సైజ్ కార్యాలయం గత కొన్ని సంవత్సరాలుగా అద్దె భవనంలోనే ఉంటున్నాం. నాకు ఉన్న సమాచారం మేరకు ఇచ్ఛాపురం, సోంపేట, బోడవరం తప్ప ఎక్కడా ఎక్సైజ్ కార్యాలయాలకు ప్రభుత్వ భవనాలు లేవు. ఆ దిశగా ఎటువంటి ఆదేశాలు రాలేదు.

– అనురాధ దేవీ, రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ

వీఆర్వోపై చర్యలు నిలిపివేత

రణస్థలం: మండలంలోని కోటపాలెం గ్రామ సచివాలయంలో పనిచేసిన గ్రామ రెవెన్యూ అధికారి పొగరు శ్రీనివాసరావుపై ప్రభుత్వం ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చినప్పటికీ, ఆయన మరణంతో తదుపరి చర్యలను నిలిపివేసింది. 2023 ఆగస్టు 10న శ్రీనివాసరావు రూ.20 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటనపై 2025 జనవరి 24న ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టం ప్రకారం ఆయనపై అభియోగ పత్రం దాఖలు చేసేందుకు అనుమతి ఇచ్చింది. అయితే అప్పటికే 2024 నవంబర్ 4న శ్రీనివాసరావు మరణించడంతో, ఏసీబీ, జిల్లా కలెక్టర్ ఇద్దరూ ప్రభుత్వం వద్ద చర్యలు నిలిపివేయాలని సిఫార్స్ చేశారు. ప్రభుత్వం పరిశీలన అనంతరం ఆయన మరణం నేపథ్యంలో తదుపరి విచారణ, చర్యలు నిలిపివేయాలని మంగళవారం నిర్ణయించింది. ఆయన వలన ప్రభుత్వానికి ఏదైనా ఆర్థిక నష్టం జరిగిందని తేలితే, ఆ నష్టాన్ని ఆయన చట్టపరమైన వారసుల నుంచి వసూలు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.

పరిశుభ్రత పాటించాలి




మెనూ పట్టిక పరిశీలిస్తున్న హరిబాబు

రణస్థలం: వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశాల మేరకు లావేరులోని బీసీ వసతి గృహాన్ని మంగళవారం సందర్శించారు. దీనిలో భాగంగా హాస్టల్‌లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనాలు అందజేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్, వార్డెన్ జె.రమేష్ బాబు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో పారిశుద్ధ్య పనులు మంగళవారం చేపట్టారు. వీధుల్లో ఉన్న చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌లకు తరలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సత్యనారాయణ, రామకృష్ణ, నాయకుడు పెయ్యిల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ రజనీ తదితరులు

ఎచ్చెర్ల: స్థానిక బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కేఆర్ రజనీ మాట్లాడుతూ.. జ్ఞాన సముపార్జనకు అవధులు లేవని నిరూపించిన మహనీయుడు వాల్మీకి అన్నారు. కారుణ్యమూర్తిగా, విశిష్ట రామాయణ ఇతిహాస రచయితగా అఖండ భారతావనికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ అచార్య బి.అడ్డయ్య మాట్లాడుతూ సృష్టి ఉన్నంత వరకూ వాల్మీకి జీవితం స్ఫూర్తిని పంచుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, ఎస్‌వో కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



రణస్థలం: రావాడ పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు



జి.సిగడాం: సీహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు



గార: పీహెచ్‌సీ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

జి.సిగడాం: ఎన్నికలకు ముందు ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు టి.త్రినాథరావు డిమాండ్ చేశారు. మండలంలోని బాతువ, జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశ కార్యకర్తలు మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశ కార్యకర్తలను మరిచిపోయారన్నారు. చాలీచాలని జీతాలతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌వో సత్యంనాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెలమల రమణ, ఆశ కార్యకర్తల నాయకులు రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, మౌళి, రాజు, రాధ, ఉష, రాము తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పాతర్లపల్లి, రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వద్ద మంగళవారం ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్‌ని ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ ఏర్పడి 20 సంవత్సరాలు అయినప్పటికి కనీస వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారితో రికార్డ్స్, అదనపు పనులు చేయించరాదని కోరారు. కార్యక్రమంలో జి.గౌరి, సీహెచ్ తవుడమ్మ, ఎల్.జ్యోతి, జి.సత్యవతి, జి.భారతి, ఎం.సుగుణ, బి.నాగమణి, జి.రూపవతి తదితరులు పాల్గొన్నారు.

గార: ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి కోరారు. మంగళవారం ఆశ దినోత్సవం పురస్కరించుకొని గార, శ్రీకూర్మం పీహెచ్‌సీలు వద్ద సమావేశమై నిరసనల అనంతరం వైద్య సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లని ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు, జాతీయ పండగల సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వి.ఉదయకుమారి, కె.సీలమ్మ, కె.కృష్ణవేణి, ఏఎల్ విజయలక్ష్మి, ఎస్.సరోజిని, దీపభాను, లక్ష్మి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రూ.10 వేల విరాళం



అన్నపూర్ణ సంఘానికి విరాళం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు రూ.10 వేలు విరాళంగా మంగళవారం అందించారు. నగరంలోని హయాతీనగర్‌కు చెందిన కిల్లాన ఫల్గుణరావు, రాధాశైలజ దంపతుల కుమారుడు మోహన్ వంశీ అతని భార్య యోజన పుట్టిన రోజు సందర్భంగా అందించినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షుడు గంగుల రమణబాబు, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత శ్రీకాకుళంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు మంగళవారం జరిగాయి. ఆలయ అర్చకులు కిరణ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య కైంకర్యాలు, కుంకుమ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామివారి దేవాలయంలో గౌరీపౌర్ణమి సందర్భంగా ఉమాదేవిని శాకాంబరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి పుష్పార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు.

కుంకుమార్చనలు

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట గ్రామంలో వెలసిన గాయిత్రీదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి కుంకుమార్చనలు మంగళవారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బచ్చు నర్సింగరెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.